సాక్షి వికారాబాద్

శనివారం । 9 । డిసెంబర్ । 2023



మళ్లీ వర్గ పోరు!

అసెంబ్లీ ఎన్నికలకు నాలుగు నెలల ముందు వరకు ఉన్న బీఆర్ఎస్ పార్టీ వర్గ పోరు ఎన్నికల తర్వాత తిరిగి మొదలైంది. 8లో▸



వన్నె తగ్గిన తెల్ల బంగారం

పత్తి పంటకు ధర లేక రైతన్న ఆందోళన చెందుతున్నాడు. మద్దతు ధర లేక నష్టపోవాల్సి వస్తోందని వాపోతున్నారు. 9లో▸



ఏం కొనాలి.. ఏం తినాలి

నిత్యావసరాల్లో ప్రధానమైనవి పప్పు దినుసులు. కొంతమందికి ప్రతి రోజు పప్పు కూర లేనిదే నోట్లో ముద్ద దిగదు. 9లో▸

న్యూస్‌రీల్

ఏబీవీపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడిగా నవీన్

తాండూరు టౌన్: అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ (ఏబీవీపీ) రాష్ట్ర కార్యవర్గ సభ్యుడిగా పెద్దేముల్ మండలం రుక్మాపూర్‌కు చెందిన నవీన్‌గౌడ్‌ను నియమించారు. ఇటీవల ఢిల్లీలో జరిగిన ఏబీవీపీ 69వ జాతీయ మహాసభల్లో అతన్ని నియమిస్తున్నట్లు రాష్ట్ర కమిటీ తెలిపింది. ఈ సందర్భంగా నవీన్ మాట్లాడుతూ.. తనపై నమ్మకంతో బాధ్యతలు అప్పగించిన రాష్ట్ర కమిటీకి ధన్యవాదాలు తెలిపారు. విద్యారంగంలో నెలకొన్న సమస్యల పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానని పేర్కొన్నారు.

స్కాలర్‌షిప్‌లకు ఆన్‌లైన్ దరఖాస్తుల ఆహ్వానం

వికారాబాద్ అర్బన్: సౌదీ అరేబియాలోని కింగ్ అజీజ్ విశ్వ విద్యాలయం 2024 విద్యా సంవత్సరానికి గాను మైనార్టీ విద్యార్థులకు స్కాలర్‌షిప్ ఇవ్వనున్నట్లు మైనార్టీ సంక్షేమ శాఖ జిల్లా అధికారి సుధారాణి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. వివిధ విభాగాల్లో మాస్టర్ డిగ్రీ, పీహెచ్‌డీ, డిగ్రీ ప్రోగ్రాం కోర్సులు చేయాలనుకునే మైనార్టీ విద్యార్థులు స్కాలర్‌షిప్‌ల కోసం ఈ నెల 28వ తేదీ వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

తపాలా సేవలను సద్వినియోగం చేసుకోవాలి



బాధిత కుటుంబ సభ్యులకు చెక్కు అందజేస్తున్న అధికారులు

కుల్కచర్ల: తపాలా సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆ శాఖ అధికారులు, ఇన్‌స్పెక్టర్ ఆఫ్ పోస్ట్ సైదానాయక్ సూచించారు. శుక్రవారం చౌడాపూర్ మండలం మరికల్ పోస్టాఫీసులో ప్రమాద బీమా చేసిన జంగయ్య మృతి చెందడంతో అతని భార్య లక్ష్మికి రూ. 10లక్షల విలువ చేసే చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వ అనుబంధ సంస్థల్లో బీమా సౌకర్యాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో తపాలా శాఖ సిబ్బంది సజ్జన్ కుమార్, కురుమూర్తి, ఎండీ పాశ, తదితరులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలులో వేగం పెంచండి

అదనపు కలెక్టర్ లింగ్యానాయక్



ధాన్యం కొనుగోలుపై చర్చిస్తున్న అదనపు కలెక్టర్ లింగ్యానాయక్

కుల్కచర్ల: రైతుల నుంచి ధాన్యం సేకరించే ప్రక్రియను వేగవంతం చేయాలని అదనపు కలెక్టర్ లింగ్యానాయక్ ఆదేశించారు. శుక్రవారం కుల్కచర్లలోని వరి కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రైతులకు ఇబ్బందులు లేకుండా కొనుగోలు ప్రక్రియను వేగవంతం చేయాలన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ మురళీధర్, ఏపీఎం శోభ, మహిళ సమాఖ్య సిబ్బంది పాల్గొన్నారు.

జాతీయ స్థాయి రన్నింగ్ పోటీలకు షాద్‌నగర్ విద్యార్థి

షాద్‌నగర్: జాతీయ స్థాయి పరుగు పందెం పోటీలకు షాద్‌నగర్ విద్యార్థి ఎంపికయ్యాడు. నియోజకవర్గ పరిధిలోని నందిగామ మండలం నర్సప్పగూడ గ్రామానికి చెందిన శివకుమార్ పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బీఏ చివరి సంవత్సరం చదువుతున్నాడు. శుక్రవారం పాలమూరు విశ్వవిద్యాలయంలో నిర్వహించిన 1500మీటర్ల పరుగు పందెం పోటీలో శివకుమార్ ప్రతిభ కనబరిచాడు. త్వరలో చెన్నైలో నిర్వహించే సౌత్ జోన్ యూనివర్సిటీ జాతీయ స్థాయి పరుగు పందెం పోటీ లకు శివకుమార్ ఎంపికై నట్లు కళాశాల ప్రిన్సిపాల్ కమల, డిగ్రీకళాశాల ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ ప్రొఫెసర్ రవీందర్‌రెడ్డి తెలిపారు.

20 మందిపై కేసు

ఇబ్రహీంపట్నం రూరల్: ప్రభుత్వ భూమిని కబ్జా చేసేందుకు యత్నించిన 20 మందిపై రెవెన్యూ అధికారులు శుక్రవారం ఆదిబట్ల పీఎస్‌లో ఫిర్యాదు చేశారు. ఆదిబట్ల ఎస్ఐ శ్రీనివాస్‌రావు తెలిపిన ప్రకారం.. మున్సిపాలిటీ పరిధిలోని కొంగరకలాన్ సర్వే నంబర్ 300లో గ్రామానికి చెందిన కొందరు వ్యక్తులు కబ్జాకు యత్నించారు. దీంతో రెవెన్యూ అధికారుల ఫిర్యాదు మేరకు కొంగరకలాన్, ఆదిబట్ల ప్రాంతాలకు చెందిన 20 మందిపై భూకబ్జా కేసులు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.



పత్తి కొనుగోలుకు కసరత్తు

- సాగు విస్తీర్ణం 2లక్షల ఎకరాలు
- ఉత్పత్తి అంచనా 1,71,000 మెట్రిక్ టన్నులు

జిల్లాలో 13 కొనుగోల కేంద్రాలు ఏర్పాటు

వికారాబాద్: పత్తి కొనుగోలుకు సీసీఐ అధికారులు సిద్ధమవుతున్నారు. వ్యవసాయ శాఖ, మార్కెటింగ్ శాఖల సమన్వయంతో సీసీఐ అధికారులు కొనుగోలు ప్రక్రియ చేపట్టనుండగా కలెక్టర్ నారాయణరెడ్డి ఈ ప్రక్రియను పర్యవేక్షిస్తున్నారు. ఇప్పటికే రెండు దఫాలుగా సమీక్షలు నిర్వహించి అధికారులకు దిశానిర్దేశం చేశారు. జిల్లాలో సాగవుతున్న పంటల విస్తీర్ణంలో సింహభాగాన్ని ఆక్రమించిన తెల్ల బంగారం కొనుగోలు ఏర్పాట్లను సీసీఐ అధికారులు ఇప్పటికే ప్రారంభించారు. వానలు తగ్గుముఖం పట్టడంతో రైతులు పత్తి తీత పనులను మొదలు పెట్టారు. ఈ నేపథ్యంలో సీసీఐ అధికారులు పత్తి పంట సాగు విస్తీర్ణం, ఉత్పత్తిపై అంచనాలు వేస్తున్నారు. జిల్లాలోని 20 మండలాల్లో పత్తి సేకరణకు కాటన్ మిల్లుల్లో కొనుగోలు కేంద్రాల ఏర్పాటుకు సన్నాహాలు చేస్తున్నారు. గతంలో 11 జిన్నింగ్ మిల్లుల ద్వారా పత్తి కొనుగోలు చేయగా, ఈ ఏడాది 13 కాటన్ మిల్లుల ద్వారా కొనుగోలు జరిపేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. ఇప్పటికే కలెక్టర్ వ్యవసాయ, రెవెన్యూ, ఫైర్, ఆర్టీఏ తదితర శాఖలతో సమావేశం ఏర్పాటు చేసిన కొనుగోలుపై పలు సూచనలు చేశారు.

2లక్షల ఎకరాల్లో పత్తి సాగు

జిల్లాలో 5,20,000 ఎకరాల్లో వివిధ పంటలు సాగవుతుండగా ఎక్కువ భాగం పత్తి పంటే వేస్తున్నారు. జిల్లా వ్యాప్తంగా 1,15000 మంది పత్తి రైతులు 2లక్షల ఎకరాల్లో పంట సాగు చేస్తున్నారు. సగటున ఎకరానికి ఆరు నుంచి ఎనిమిది క్వింటాళ్ల చొప్పున 1,71,000 మెట్రిక్ టన్నుల పత్తి ఉత్పత్తి వచ్చే అవకాశం ఉందని వ్యవసాయ శాఖ అధికారులు అంచనా వేస్తున్నారు. ఈ ఉత్పత్తి మొత్తం సీసీఐ ద్వారా కొనుగోలు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. కొనుగోలు కేంద్రాల వద్ద రైతులకు బాత్‌రూంలు, మరుగుదొడ్లు, పార్కింగ్ స్థలం, తాగు నీటి వసతి కల్పించాలని ఉన్నతాధికారులు ఆదేశాలు జారీ చేశారు.

ఇబ్బందులు తొలగేనా?

ఐదారేళ్లుగా పత్తి కొనుగోలు కేంద్రాల వద్ద రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతూ వచ్చారు. గతేడాది బహిరంగ మార్కెట్‌లో పత్తికి అధిక ధరలు పలకడంతో సీసీఐ కొనుగోలు కేంద్రాలతో అవసరం లేకుండా సీజన్ ముగిసింది. ఈ సారైనా తమకు ఇబ్బందులు లేకుండా చూడాలని రైతులు కోరుతున్నారు. వికారాబాద్, పరిగి వ్యవసాయ డివిజన్లలో పత్తి అత్యధికంగా సాగవుతోంది. కానీ మూడు కొనుగోలు కేంద్రాలను మాత్రమే ఏర్పాటు చేస్తున్నారు. ఈ సారి మరొకటి ఏర్పాటు చేయనున్నారు. తక్కువ సాగవుతున్న తాండూరు ప్రాంతంలో ఎక్కువ కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నారు. దీంతో పరిగి, పూడూరు మండలాల పరిధిలోని రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ మూడు కొనుగోలు కేంద్రాల్లోనే పరిగి, వికారాబాద్ వ్యవసాయ డివిజన్లకు చెందిన రైతులందరూ పత్తి విక్రయిస్తుండటంతో రద్దీ విపరీతంగా ఉంటోంది. దీంతో పత్తి విక్రయించేందుకు రైతులు వారాల తరబడి పడిగాపులు గాయాల్సి వస్తోంది. దీంతో చేసేదేమీ లేక దళారులను ఆశ్రయిస్తున్నారు.

ధరలు తగ్గుముఖం

మరో 10రోజుల్లో పూర్తి స్థాయిలో పత్తి మార్కెట్‌లోకి రానుంది. ఈ ఏడాది క్వింటాలు పత్తికి ప్రభుత్వం రూ. 7000 మద్దతు ధర నిర్ణయించింది. కొద్ది రోజుల క్రితం వరకు క్వింటాలు పత్తి రూ. 7500 నుంచి రూ. 8000 వరకు అమ్ముడు పోయింది. ప్రస్తుతం ధరలు తగ్గి రూ. 6700 చేరుకుంది. పంట చేతికందేలోపు ధరలు మరింత పతనమయ్యే పరిస్థితి ఉండడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. బహిరంగ మార్కెట్‌లో ఇవే ధరలు మరో నెల రోజుల పాటు కొనసాగితే సీసీఐ కొనుగోలు కేంద్రాల్లో పత్తి విక్రయించడం తప్ప మరో మార్గం ఉండదు.

> **ఏర్పాట్లు చేస్తున్నాం**
>
> పత్తి రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని ఏర్పాట్లు చేస్తున్నాం. పత్తి మిల్లులు ఉన్న ప్రాంతాల్లోనే కొనుగోలు కేంద్రా లను ఏర్పాటు చేస్తున్నాం. రైతులు ఎంత పత్తి తెచ్చినా కొనుగోలు చేస్తాం. విక్రయించిన వారంలోపే రైతుల ఖాతాల్లో డబ్బు జమ చేస్తాం.
>
> – నారాయణరెడ్డి, కలెక్టర్

కొత్త ప్రభుత్వానికి సహకరిస్తాం

టీఎన్‌జీవోల సంఘం జిల్లా అధ్యక్షుడు శివకుమార్



కొత్త ప్రభుత్వానికి శుభాకాంక్షలు తెలుపుతున్న టీఎన్‌జీవోల సంఘం నాయకులు, ఉద్యోగులు

వికారాబాద్ అర్బన్: రాష్ట్రంలో కొత్తగా ఏర్పడిన కాంగ్రెస్ ప్రభుత్వానికి తాము పూర్తి స్థాయిలో సహకరిస్తామని టీఎన్‌జీవోల సంఘం జిల్లా అధ్యక్షుడు శివకుమార్ తెలిపారు. శుక్రవారం కలెక్టర్ కార్యాలయం వద్ద టీఎన్‌జీవోల సంఘం ఆధ్వర్యంలో ఉద్యోగులు కొత్త ప్రభుత్వానికి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం శివకుమార్ మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి, ఆయన మంత్రి వర్గానికి టీఎన్‌జీవోల సహకారం ఉంటుందన్నారు. జిల్లా నుంచి ఎమ్మెల్యేలుగా విజయం సాధించిన గడ్డం ప్రసాద్‌కుమార్, మనోహర్‌రెడ్డి, రేవంత్‌రెడ్డి, రామ్మోహన్‌రెడ్డిలకు శుభాకాంక్షలు తెలిపారు. త్వరలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని కలసి ఉద్యోగుల సమస్యలను వివరిస్తామన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు పూర్తిస్థాయిలో అమలయ్యేలా చూస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి అజ్మత్ పాషా, అసోసియేట్ అధ్యక్షుడు నర్సింలు, వికారాబాద్ మండల అధ్యక్షుడు మల్లేష్ గౌడ్, నాయకులు విజయ్‌కుమార్, హీరాలాల్, ఫోర్త్ క్లాస్ ఎంప్లాయీస్ విభాగం అధ్యక్షులు అరుణ, నిర్మల తదితరులు పాల్గొన్నారు.

'ఇస్తేమా'కు ఏర్పాట్లు చేయండి



అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ నారాయణరెడ్డి

- కలెక్టర్ నారాయణరెడ్డి

వికారాబాద్ అర్బన్: పరిగి మండల పరిధిలో జనవరి 5, 6, 7 తేదీల్లో నిర్వహించే ఇస్లాం మత ఇస్తేమా కార్యక్రమానికి అన్ని ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ నారాయణరెడ్డి అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లో ఇస్లాం మత పెద్దలతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మూడు రోజులపాటు జరిగే ఇస్తేమా సభకు వచ్చే వారి కోసం తాగునీరు, విద్యుత్, రోడ్లు, వాహనాల పార్కింగ్ కోసం స్థలం, పారిశుద్ధ్య పనులు చేపట్టాలని ఆదేశించారు. ఈ పనుల్లో మండల స్థాయి అధికారులను కూడా భాగస్వాములు చేయాలని సూచించారు. కార్యక్రమంలో మిషన్ భగీరథ గ్రిడ్ ఇంట్రా ఈఈలు చల్మారెడ్డి, బాబు శ్రీనివాస్, మైనార్టీ సంక్షేమ శాఖ అధికారులు సుధారాణి, జిల్లా పంచాయతీ రాజ్ అధికారి తరుణ్‌కుమార్, పరిగి మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్, విద్యుత్ శాఖ ఇంజనీర్లు పాల్గొన్నారు.

ప్రతి సోమవారం 'ప్రజావాణి'

అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో రద్దు చేసిన ప్రజావాణి కార్యక్రమాన్ని ఇకపై ప్రతి సోమవారం నిర్వహించనున్నట్లు కలెక్టర్ సి నారాయణరెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. సోమవారం ఉదయం 10:30 గంటలకు కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించే ప్రజావాణి కార్యక్రమానికి హాజరై తమ సమస్యలను పరిష్కరించుకోవాలని సూచించారు.



లేడీస్ స్పెషల్

12 లక్షల మంది మహిళలకు ఇక ఉచిత ప్రయాణం

సాక్షి, సిటీబ్యూరో: ప్రభుత్వం ప్రవేశపెట్టిన మహాలక్ష్మి పథకంలో భాగంగా గ్రేటర్‌లో సుమారు 12 లక్షల మంది మహిళలకు సిటీ బస్సుల్లో ఉచిత ప్రయాణ సదుపాయం లభించనుంది. అసంఘటిత రంగానికి చెందిన మహిళా కార్మికులు, ప్రభుత్వ, ప్రైవేట్ సంస్థల్లో పనిచేసే ఉద్యోగులు, ఔట్‌సోర్సింగ్ మహిళా సిబ్బంది, ఐటీ సంస్థలు, ఆసుపత్రులు, కార్పొరేట్ సంస్థల్లో పని చేసే హౌస్ కీపింగ్ సిబ్బంది, నిర్మాణరంగం కూలీలు తదితర వర్గాలకు చెందిన మహిళలతో పాటు మరో 2 లక్షల మందికి పైగా విద్యార్థినులకు శనివారం మధ్యాహ్నం నుంచి సిటీ బస్సుల్లో ఉచిత ప్రయాణ సదుపాయం లభించనుంది. సిటీ ఆర్డినరీ, మెట్రో ఎక్స్‌ప్రెస్ బస్సుల్లో మహిళా ప్రయాణికులు ఎక్కడి నుంచి ఎక్కడి వరకైనా ఉచితంగా ప్రయాణం చేయొచ్చు.

జిల్లా బస్సుల్లోనూ..

నగరంలోని వివిధ ప్రాంతాల మధ్య నడిచే సిటీ బస్సులతో పాటు హైదరాబాద్ నుంచి తెలంగాణలోని అన్ని ప్రాంతాలకు రాకపోకలు సాగించే మరో 3,500కు పైగా జిల్లా బస్సుల్లోనూ ఉచిత ప్రయాణ సదుపాయం లభించనుంది. మరోవైపు ప్రస్తుతం సెట్విన్ బస్సులు, సెవెన్ సీటర్, మూడు సీట్ల ఆటోలు, షేర్ ఆటోల్లో ప్రయాణం చేసే మరో 3 లక్షల మందికి పైగా వనితలు క్రమంగా ఈ పథకం వైపు మళ్లే అవకాశం ఉంది.దీంతో రానున్న రోజుల్లో మహాలక్ష్మి పథకం వినియోగదారుల సంఖ్య 12 లక్షల నుంచి 15 లక్షల వరకు పెరిగే అవకాశం ఉంటుందని ఆర్టీసీ అధికారులు అంచనా వేస్తున్నారు. ట్రాన్స్‌జెండర్‌లకు కూడా ప్రభుత్వం ఉచిత ప్రయాణ సదుపాయం కల్పించింది. వారి సంఖ్య కూడా వేలల్లోనే ఉంటుంది.

ఈ రూట్‌లలో డిమాండ్ ఎక్కువ...

- నగర శివారు ప్రాంతాల నుంచి సికింద్రాబాద్, అమీర్‌పేట్, బంజారాహిల్స్, జూబ్లీహిల్స్, హైటెక్‌సిటీ, గచ్చిబౌలి, కొండాపూర్, మెహిదీపట్నం, పటాన్‌చెరు, లింగంపల్లి, కోఠి, అబిడ్స్, దిల్‌సుఖ్‌నగర్ తదితర ప్రాంతాలకు మహిళలు ఉద్యోగ, ఉపాధి అవసరాల కోసం రాకపోకలు సాగిస్తారు.
- చర్లపల్లి, జీడిమెట్ల, ఐడీఏ బొల్లారం, ఉప్పల్, చెంగిచర్ల తదితర పారిశ్రామిక ప్రాంతాల్లో పని చేసేందుకు వెళ్లే మహిళల సంఖ్య కూడా ఎక్కువే. బాచుపల్లి, కూకట్‌పల్లి హౌసింగ్ బోర్డు, మియాపూర్, తదితర ప్రాంతాల నుంచి ప్రతి రోజు వేలాది మంది హౌస్‌కీపింగ్ సిబ్బంది సిటీ బస్సుల్లో ఐటీ కారిడార్‌లకు రాకపోకలు సాగిస్తారు.
- నగరంలోని పాత బస్తీలో సైతం సిటీ బస్సుల వినియోగం ఎక్కువే.
- ప్రస్తుతం ఒక్కో ప్రయాణికురాలు కనిష్టంగా రూ.10 నుంచి గరిష్టంగా రూ.30 వరకు చార్జీల రూపంలో చెల్లిస్తున్నారు.
- మొత్తంగా ప్రయాణికుల నుంచి ఆర్టీసీకి ప్రతి రోజు రూ.2.7 కోట్లకు పైగా ఆదాయం లభిస్తుండగా బస్సుల నిర్వహణ, ఇంధనం, ఉద్యోగుల జీతభత్యాలు తదితర ఖర్చులతో రోజుకు రూ.3.5 కోట్ల వరకు ఖర్చవుతున్నట్లు అంచనా. దీంతో రోజుకు రూ.80 లక్షల వరకు నష్టం వాటిల్లుతోంది.
- మహిళా ప్రయాణికులకు ఉచిత సదుపాయం కల్పించడం వల్ల ప్రతిరోజూ రూ.10 లక్షల వరకు ఆర్టీసీపై భారం పడనుంది.

గుర్తింపు కార్డు తప్పనిసరి

శనివారం మధ్యాహ్నం నుంచి అమల్లోకి రానున్న మహాలక్ష్మి పథకం కింద సిటీ బస్సుల్లో ఉచితంగా ప్రయాణం చేసేందుకు మహిళలు, విద్యార్థినులు, బాలికలు, ట్రాన్స్‌జెండర్స్ ఆధార్ కార్డును లేదా చిరునామాను ధ్రువీకరించే మరేదైనా గుర్తింపు పత్రాన్ని ప్రయాణ సమయంలో ఆర్టీసీ కండక్టర్‌కు చూపించాల్సి ఉంటుంది.

ఇదీ సిటీ బస్సుల లెక్క

- గ్రేటర్‌లోని మొత్తం డిపోలు: 29
- అన్ని డిపోల్లో ఉన్న బస్సుల సంఖ్య సుమారుగా : 2550
- ప్రతి రోజు తిరిగే ట్రిప్పులు: సుమారు 30,000
- మొత్తం రూట్‌లు: 1150
- ప్రయాణికుల సంఖ్య: 25 లక్షలకు పైగా
- మహిళా ప్రయాణికులు సుమారు: 12 లక్షలు
- ఉచిత ప్రయాణాన్ని అనుమతించే ఆర్డినరీ, మెట్రో బస్సులు : 2000



ప్రార్థనలు చేస్తున్న యాత్రికులు

జాతరకు భక్తుల తాకిడి

ధారూరు: ఆసియా ఖండంలోనే అతి పెద్ద ధారూరు మెథడిస్టు క్రిస్టియన్ జాతరకు భక్తులు భారీగా తరలివస్తున్నారు. జాతర ప్రారంభం నాటి నుంచి నేటి వరకు దాదాపు లక్ష మంది యాత్రికులు వచ్చినట్లు నిర్వాహకులు అంచనా వేశారు. శుక్రవారం జాతర ప్రాంగణం భక్తులతో సందడిగా మారింది. ఖాళీ స్థలాల్లో గుడారాలు వేసుకొని మూడు రోజుల పాటు ప్రార్థనల్లో పాల్గొంటున్నారు. పెద్ద సంఖ్యలో దుకాణాలు ఏర్పాటు చేశారు. వ్యాపారాలు జోరుగా సాగుతున్నాయి.



జాతరలో వెలసిన దుకాణాలు



ప్రసాద్‌కుమార్‌కు శుభాకాంక్షలు తెలుపుతున్న ట్రెసా ప్రతినిధులు



బొకే అందజేస్తున్న ఎస్పీ కోటిరెడ్డి

ప్రసాద్‌కుమార్‌కు శుభాకాంక్షలు

అనంతగిరి: అసెంబ్లీ స్పీకర్‌గా బాధ్యతలు చేపట్టనున్న వికారాబాద్ ఎమ్మెల్యే గడ్డం ప్రసాద్‌కుమార్‌ను శుక్రవారం ట్రెసా ప్రతినిధులు హైదరాబాద్‌లో కలసి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గౌతమ్ కుమార్, రాష్ట్ర కమిటీ సభ్యుడు అమరేంద్ర కృష్ణ, వికారాబాద్ జిల్లా అధ్యక్షుడు కృష్ణయ్య, ప్రధాన కార్యదర్శి విజయేందర్ తదితరులు పాల్గొన్నారు.

శుభాకాంక్షలు తెలిపిన ఎస్పీ

ఎమ్మెల్యే గడ్డం ప్రసాద్‌కుమార్‌ను శుక్రవారం ఎస్పీ కోటిరెడ్డి హైదరాబాద్‌లో మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

క్లుప్తంగా

రైలు ఢీకొని గుర్తు తెలియని వ్యక్తి మృతి

తాండూరు టౌన్: రైలు ఢీకొనడంతో ఓ గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందాడు. ఈ ఘటన తాండూరు రైల్వే స్టేషన్ సమీపంలో శుక్రవారం చోటు చేసుకుంది. రైల్వే పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. తాండూరు, రుక్మాపూర్ స్టేషన్ల మధ్య శుక్రవారం ఉదయం రైలు ఢీకొనగా ఛిద్రమై ఉన్న గుర్తు తెలియని మృతదేహాన్ని(35) గుర్తించామన్నారు. శరీరంపై నలుపు రంగు టీషర్టు, లేత నీలిరంగు ప్యాంట్ ధరించి ఉన్నట్లు చెప్పారు. ఈమేరకు కేసు నమోదు చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు.

ప్రేమ పేరుతో మోసం
యువకుడి అరెస్ట్

పహాడీషరీఫ్: ప్రేమ పేరుతో యువతిని మోసం చేసిన యువకుడిని బాలాపూర్ పోలీసులు అరెస్ట్ చేసి శుక్రవారం రిమాండ్‌కు తరలించారు. ఇన్‌స్పెక్టర్ బి.వెంకట్ రెడ్డి తెలిపిన ప్రకారం.. మల్లాపూర్ గ్రామానికి చెందిన యువతి (22), సుల్తాన్‌పూర్‌కు చెందిన ఓర్సు వేణుగోపాల్ మూడేళ్లుగా ప్రేమలో ఉన్నారు. పెళ్లి చేసుకుంటానని నమ్మించిన వేణుగోపాల్ ఆమెను శారీరకంగా లొంగదీసుకున్నాడు. యువతి పెళ్లి ప్రస్తావన తీసుకురావడంతో తాను చేసుకోనంటూ చెప్పాడు. దీంతో మోసపోయానని గ్రహించిన యువతి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. మహేశ్వరం ఏసీపీ శ్రీనివాస్ యాదవ్ పర్యవేక్షణలో కేసు నమోదు చేసుకొని నిందితుడిని రిమాండ్‌కు తరలించారు.

'108, 102' వాహనాల తనిఖీ

కందుకూరు: కందుకూరు పీహెచ్‌సీలో శుక్రవారం 108, 102 అంబులెన్స్ వాహనాలను జిల్లా ప్రోగ్రాం మేనేజర్ వసంత్ తనిఖీ చేశారు. 108 అంబులెన్స్‌లో ఆక్సిజన్‌తో పాటు ప్రథమ చికిత్సకు అవసరమైన అన్ని వస్తువులు ఉన్నాయా? లేదా? అని పరిశీలించారు. రికార్డులను తనిఖీ చేసి సిబ్బంది ఈఎంటీ సురేందర్, పైలెట్లు యాదయ్య, పరశురాములుకు పలు సూచనలు చేశారు. ఎల్లప్పుడు అప్రమత్తంగా ఉండాలని, అత్యవసరంగా కాల్స్ వచ్చినప్పుడు వెంటనే స్పందించాలన్నారు. అనంతరం 102 అంబులెన్స్‌ను తనిఖీ చేసి సిబ్బందికి పలు సూచనలు అందించారు.

గంజాయి విక్రయిస్తున్న వ్యక్తి అరెస్ట్
3.2 కిలోల గంజాయి స్వాధీనం

మీర్‌పేట: గంజాయి విక్రయిస్తున్న వ్యక్తిని మహేశ్వరం ఎస్‌ఓటీ పోలీసులు అదుపులోకి తీసుకుని 3.2 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. ఈ ఘటన శుక్రవారం మీర్‌పేట పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల తెలిపిన ప్రకారం.. నాగర్‌కర్నూల్ జిల్లా వెల్దండ మండలం చేదురుపల్లి గ్రామానికి చెందిన డ్రైవర్‌గా పనిచేసే రాగుళ్ల శ్రీకాంత్ (28) గంజాయిని కొనుగోలు చేసి మీర్‌పేట తిరుమలనగర్‌లో విక్రయిస్తున్నాడు. సమాచారం అందుకున్న మహేశ్వరం ఎస్‌ఓటీ బృందం మీర్‌పేట పోలీసులతో కలిసి శ్రీకాంత్‌ను అదుపులోకి తీసుకోగా, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం విశాఖపట్నంకు చెందిన రాజు పరారీలో ఉన్నాడు. ఈ మేరకు శ్రీకాంత్ వద్ద నుంచి రూ.75 వేల విలువైన గంజాయి ప్యాకెట్లు, ఒక హోండా యాక్టివా, సెల్‌ఫోన్‌ను స్వాధీనం చేసుకుని మీర్‌పేట పోలీస్‌స్టేషన్‌లో అప్పగించారు.



స్వాధీనం చేసుకున్న గంజాయి ప్యాకెట్లు. చిత్రంలో నిందితుడు శ్రీకాంత్

మళ్లీ వర్గ పోరు!

తాండూరులో బీఆర్ఎస్ ఓటమి చిచ్చు
- మోసం చేశారంటూ పట్నం వర్గీయులపై ప్రచారం
- దుర్భాషలాడుతూ పోస్టులు పెడుతున్న పైలెట్ వర్గీయులు



తాండూరు: అసెంబ్లీ ఎన్నికలకు నాలుగు నెలల ముందు వరకు ఉన్న బీఆర్ఎస్ పార్టీ వర్గ పోరు ఎన్నికల తర్వాత తిరిగి మొదలైంది. తాండూరులో పైలెట్ రోహిత్‌రెడ్డి ఓటమికి పట్నం మహేందర్‌రెడ్డి వర్గీయులే ప్రధాన కారణమంటూ పైలెట్ వర్గీయులు సోషల్ మీడియా వేదిక చేసుకొని వారం రోజులుగా పోస్టులు పెడుతున్నారు. కర్ణుడి చావుకు సవాలక్ష కారణాలు అన్న చందంగా రోహిత్‌రెడ్డి ఓటమికి మాత్రం పది కారణాలు కనిపిస్తున్నాయి. వాటిని పక్కన పెట్టి మాజీ మంత్రి పట్నం మహేందర్‌రెడ్డి కుటుంబ సభ్యులు, పట్నం వర్గీయులను టార్గెట్ చేసుకొని పోస్టులు పెడుతున్నారు. జెడ్పీ చైర్‌పర్సన్ పట్నం సునీతారెడ్డి రోహిత్‌రెడ్డి ఓటమికి పని చేశారనే కోపంతో పైలెట్ వర్గీయులు ఆమెని దుర్భాషలాడటంతో పాటు సోషల్ మీడియాలో అడ్డగోలుగా పోస్టులు పెట్టారు. దీంతో పట్నం అభిమానులు తాండూరు డీఎస్పీ శేఖర్‌గౌడ్‌కు ఫిర్యాదు చేశారు. తాండూరు పట్టణ పోలీస్ స్టేషన్‌లో ప్రజా ప్రతినిధులను అనుచిత వ్యాఖ్యలు చేసిన వారిపై రెండు కేసులు నమోదు అయ్యాయి.

అసమ్మతిలో పాత నాయకులు

పైలెట్ గెలుపు కోసం అహర్నిశలు కృషి చేయడంతో పాటు వ్యూహకర్తలుగా ఉన్న ఆయన అనుచరులపై మొదటిశ్రేణి నాయకులు కోపంతో రగిలిపోతున్నారు. 2018 అసెంబ్లీ ఎన్నికలలో పైలెట్ ఓటమి కోసం పని చేసిన వారంతా ప్రస్తుతం ఆయన గూటికి చేరుకున్నారు. అలాంటి వారిని పక్కన పెట్టుకోవద్దని సొంత పార్టీ నాయకులు ఎంత చెప్పినా రోహిత్‌రెడ్డి వినిపించుకోలేదనే విమర్శలు న్నాయి. పైలెట్ శిబిరంలో వారిదే పెత్తనం కావడంతో మొదటిశ్రేణి నాయకులు సైతం కొంత అసహనానికి గురయ్యారు. ఎన్నికల సమయంలో కూడా కష్టపడి ఓట్లు వేయించే నాయకులను పక్కన బెట్టి ఓటు బ్యాంకు లేని వారికి రోహిత్‌రెడ్డి ప్రాధాన్యత ఇచ్చారంటూ రగిలిపోతున్నారు. దీంతో వ్యూహకర్తలుగా వ్యవహరించిన వారి ఫొటోలతో కూడిన వీడియోను తయారు చేసి సోషల్ మీడియాలో వైరల్ చేశారు. దీనిలో నేతల ఫొటోల కింద ఉడుము, గబ్బిలం, పిల్లిలను పెట్టి వీడియోను తయారు చేయించారు. అవి పెద్ద ఎత్తున వైరల్ అయ్యాయి. ఎన్నికల ఫలితాలు వచ్చి వారం రోజులు గడిచిన కూడా బీఆర్ఎస్ పార్టీ నాయకులు ఓటమి నుంచి తెరుకోలేకపోతున్నారు. రానున్న రోజుల్లో పట్నం-పైలెట్‌ల మధ్య వర్గపోరు ఇలాగే ఉంటుందా లేక సద్దుమణుగుతోందా అనేది వేచి చూడాలి.

చిత్రపురి అక్రమాలపై ఫిర్యాదు

మణికొండ: తమకు కేటాయించిన గృహాలను తమకు ఇవ్వకుండా ఇతరులకు అమ్ముకుంటూ కార్మికులను ఇబ్బందులకు గురిచేస్తున్నారని చిత్రపురి బాధితుడు భాస్కర్‌రావు శుక్రవారం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి ఫిర్యాదు చేశారు. మణికొండ మున్సిపాలిటీ పరిధిలోని చిత్రపురి కోఆపరేటీవ్ హౌసింగ్ సొసైటీలో అనేక అక్రమాలు జరిగాయని, వాటి విషయంలో గత ప్రభుత్వ పెద్దలను కలిసినా ప్రయోజనం లేకుండా పోయిందని అదే విషయాన్ని ప్రస్తుత ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి ప్రజాదర్బార్‌లో ఫిర్యాదు చేసినట్టు ఆయన మీడియాతో పేర్కొన్నారు. తన లాంటి వాళ్లు వందల సంఖ్యలో ఉన్నారని, వారికి కేటాయించిన గృహాలను ఇతరులకు అమ్ముకునే అధికారం సొసైటీ కమిటీకి ఎవరిచ్చారని ఆయన ప్రశ్నించారు. సమగ్ర విచారణ చేపట్టి తమకు న్యాయం చేయాలని కోరామని, దాన్ని సీరియస్‌గా పరిశీలించి న్యాయం చేస్తామని ముఖ్యమంత్రి హామీ ఇచ్చాడని ఆయన పేర్కొన్నారు.

తాగునీటి సరఫరాకు ఆటంకం

- ఆగిన మిషన్ భగీరథ సరఫరా
- మరమ్మతులకు గురైన యంత్రాలు

ధారూరు: మండలంలో గత నెల 30 నుంచి మిషన్ భగీరథ తాగునీటి సరఫరా ఆగిపోయిందని ప్రజలు శుక్రవారం వాపోయారు. గ్రామాల్లో ప్రత్యామ్నాయ సాగునీటి సరఫరా వ్యవస్థ లేకపోవడం, మిషన్ భగీరథ నీటి సరఫరా నిలిచిపోవడంతో తాగునీటికి ఆటంకం ఏర్పడింది. సరఫరా నిలిచిపోతుందని అధికారులు ముందుగానే ప్రజాప్రతినిధులకు సమాచారం ఇస్తున్నారని, ప్రజలు మాత్రం తమను నిందిస్తున్నారని ఆయా గ్రామాల సర్పంచులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పరిగి సమీప రాఘవపూర్‌కు సర్కల్‌పాడ్ నుంచి నీరు రావడం లేదని, విద్యుత్ మోటార్లు మొరాయించడం వల్ల తాగునీటి సరఫరాలో అంతరాయం కలిగిందని మిషన్ భగీరథ అధికారులు చెబుతున్నారు. మండలంలో వారం రోజుల నుంచి నీటి సరఫరా నిలిచిపోవడంతో ప్రజలు ఆందోళనకు గురవుతున్నారు.

గిరిజనుల ఆందోళన

రాంపూర్‌తండాలో వారం రోజుల నుంచి తాగునీటి సరఫరా లేక తీవ్ర అవస్థలు పడుతున్నామని గిరిజనులు వాపోయారు. తాగునీటి సరఫరాను పునరుద్ధరించడంలో అధికారులు అలసత్వం ప్రదర్శిస్తున్నారని వారు ఆరోపించారు. తాగునీటి కోసం తండావాసులు నిలదీస్తున్నారని, వెంటనే అధికారులు స్పందించి తాగునీటి సరఫరా జరిగేలా చూడాలని సర్పంచు పాండునాయక్ కోరారు.

విద్యుత్ మోటార్లు మొరాయించాయి: డీఈఈ

సర్కల్‌పాడ్ నుంచి పరిగి మండలం రాఘవపూర్‌కు నీరు రావాల్సి ఉందని, అక్కడ విద్యుత్ మోటార్లు మొరాయించడంతో తాగునీటి సరఫరాలో అంతరాయం కలిగిందని మిషన్ భగీరథ డిప్యూటీ ఈఈ విజయకుమార్ తెలిపారు. పంప్‌హౌజ్ వద్ద మోటార్లు మరమ్మతులు చేసి సరఫరాను పునరుద్ధరిస్తామని ఆయన వివరించారు.

పార్కింగ్ పేరిట వసూళ్ల పర్వం

- ధారూరు మెథడిస్టు క్రిస్టియన్ జాతరలో
- రూ.లక్షల్లో వసూలు చేస్తున్న ఫీజు
- ఒక్క రోజులోనే 5 వేల వాహనాల రాక

ధారూరు: ధారూరు మెథడిస్టు క్రిస్టియన్ జాతరకు వచ్చే వాహనాలకు పార్కింగ్ పేరిట భారీగా వసూలు చేస్తున్నారు. శుక్రవారం ఒక్కరోజే పార్కింగ్ ఫీజు కింద దాదాపు రూ.5 లక్షల చేశారు. జాతర పూర్తయ్యే వరకు దాదాపు లక్ష వాహనాలు వస్తాయని నిర్వాహకులు అంచనా వేశారు. ఫోర్ వీలర్‌కు రూ.100, త్రి, టూ వీలర్‌కు రూ.50 చొప్పున వసూలు చేయాలని నిర్ణయించారు. బలవంతంగా వసూలు చేసి కొంత డబ్బును కొన్ని శాఖల అధికారులకు వాటా కూడా ఇవ్వాల్సి ఉంటుందని స్వయంగా ఫీజు వసూలు చేసే ఓ వ్యక్తే చెబుతున్నారు. స్టేషన్‌ధారూరు గ్రామ నుంచి రూ.లక్షల్లో వసూలు అవుతుండగా, దోర్నాల్ జీపీ నుంచి కొద్దిగా వసూళ్లు తగ్గుతాయి. పార్కింగ్ ఫీజు వేలంలో ఆయా గ్రామాల ప్రధాన పార్టీకి చెందిన నాయకులే సిండికేటుగా ఏర్పడి వేలంను దక్కించుకున్నారు.

సిండికేటుగా వ్యవహారం

ప్రతి వాహనాన్ని ఆపి మరీ డబ్బులు వసూలు చేస్తున్నారు. జాతరకు వచ్చిన తాము పార్కింగ్ ఏరియాలో పెట్టమని, ఫీజు ఇవ్వలేమని, అడవిలో



పార్కింగ్ స్థలానికి దూరంగా ఉన్న వాహనాలకు డబ్బులు వసూలు చేస్తున్న సిబ్బంది

పార్కింగ్ చేసి ఎవ్వరికి ఇబ్బంది పెట్టమని బతిమలాడిన పార్కింగ్ నిర్వాహకులు అనుమతించట్లేదు. వీరి ఆగడాలు మితిమీరి పోతున్నా అధికారులు పట్టించుకోవడం లేదు. దీంతో పార్కింగ్ ఫీజు రాయుళ్ల వ్యవహారం మూడు పువ్వులు, ఆరు కాయలు అన్న చందంగా విరాజిల్లుతోంది. వాస్తవానికి పార్కింగ్ స్థలంలోకి వెళ్లే వాహనాలకు మాత్రమే పార్కింగ్ ఫీజు వసూలు చేయాలి. సిండికేటుగా వేలంగా తీసుకున్న వ్యక్తులు మాత్రం అందిన కాడికి దండుకుంటున్నారు. పార్కింగ్ స్థలంలోకి వెళ్లే వాహనాలకు మాత్రమే డబ్బులు వసూలు చేయలి కదా అని ఎంపీఓ షఫీఉల్లాను ప్రశ్నించగా గ్రామ కార్యదర్శిని అడిగి చెబుతానంటూ మాట మార్చడం గమనార్హం. జిల్లా ఉన్నతాధికారులు తగిన చొరవ తీసుకుని పార్కింగ్ ఫీజు వసూలు పేరిట అక్రమాలను అడ్డుకోవాలని జాతర వచ్చే భక్తులు కోరుతున్నారు.

నిర్వాహకుల నుంచి వసూళ్లు

జాతరకు వచ్చే పాస్టర్లు, కొందరు నిర్వాహకుల నుంచి పార్కింగ్ ఫీజు వసూలు చేయడం దారుణమన్నారు. ఉత్సవాలను తామే నిర్వహిస్తుంటే తమ నుంచే డబ్బులు వసూలు చేయడం సహించరాని విషయమని ఓ పాస్టర్ పేర్కొనడం గమనార్హం. ఇక నుంచైన పార్కింగ్ స్థలంలోకి వెళ్లే వాహనాలకు మాత్రమే డబ్బులు చేయాలని కోరారు.

అధిక సాంద్రత పద్ధతి మేలు



పత్తి సాగులో శిక్షణ ఇస్తున్న శాస్త్రవేత్తలు

- పత్తి సాగులో అధిక దిగుబడులు
- శిక్షణలో వ్యవసాయ శాస్త్రవేత్తలు

పరిగి: కొన్నేళ్లుగా పత్తి దిగుబడి చాలా నిలకడగా ఉందని, పంట దిగుబడిని పెంచాల్సిన అవసరం ఉందని వ్యవసాయ పరిశోధన స్థానం ఏరువాత కేంద్రం కోఆర్డినేటర్ లక్ష్మణ్ సూచించారు. ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం పరిశోధన క్షేత్రం, ఏరువాత కేంద్రం తాండూరు ఆధ్వర్యంలో శుక్రవారం మండల పరిధిలోని తొండుపల్లిలో అధిక సాంద్రత పద్ధతితో పత్తిసాగుపై రైతులకు క్షేత్రస్థాయి శిక్షణ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. గ్రామంలోని రాంరెడ్డి అధిక సాంద్రత పద్ధతిలో పత్తి పంట సాగు చేశారన్నారు. రైతు సాగు విధానం, దిగుబడిని పరిశీలించుకోవాలని తెలిపారు. పంటలో ఆశించే వివిధ రకాల చీడపీడలైన గులాబీ, తామర పురుగులు, తెల్ల దోమ, పచ్చదోమ, వేరుకుళ్లు తెగులుకు అధికారులు సూచించిన విధంగా రైతులు పిచికారి చేస్తే ఎలాంటి పంట నష్టం ఉండదన్నారు. కార్యక్రమంలో శాస్త్రవేత్తలు యమున, వెంకటేష్ రైతులు తదితరులు పాల్గొన్నారు.

బాలుడిని కిడ్నాప్ చేసిన రౌడీషీటర్ అరెస్ట్

పహాడీషరీఫ్: బాలుడిని కిడ్నాప్ చేసిన రౌడీషీటర్‌ను బాలాపూర్ పోలీసులు అరెస్ట్ చేసి శుక్రవారం రిమాండ్‌కు తరలించారు. ఇన్‌స్పెక్టర్ బి.వెంకట్ రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. ఈ నెల 3న రాత్రి 9 గంటల సమయంలో సాదత్ నగర్‌కు చెందిన ఉమ్రాన్ బిన్ సామోలీ కుమారుడు (17)ను రౌడీషీటర్ ముబారక్ సిగర్ కిడ్నాప్ చేశాడు. కాసేపటికి తిరిగి ఎర్రకుంట పెట్రోల్ పంప్ వద్ద వదిలివేశాడు. బాలుడి తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు రౌడీషీటర్‌ను అరెస్ట్ చేసి శుక్రవారం రిమాండ్‌కు తరలించారు.

సహజ ప్రసవాలే మేలు
జిల్లా వైద్యాధికారి వెంకటేశ్వర్‌రావు

మణికొండ: మహిళలకు సహజ ప్రసవాలే మేలు చేస్తాయని, సిజేరియన్ ప్రసవాలతో వారి ఆరోగ్యాలకు ఎంతో కీడు జరుగుతుందని జిల్లా వైద్యాధికారి డాక్టర్ వెంకటేశ్వర్ రావు అన్నారు. నార్సింగి రూరల్ హెల్త్ సెంటర్‌కు అమెరికాకు చెందిన ఆర్‌మాన్ ఎన్‌జీవో ప్రతినిధులు వచ్చారు. వారికి మన దేశం, రాష్ట్రంలో జరుగుతున్న ప్రసవాలు, మహిళల ఆరోగ్యం, వారికి ఇస్తున్న పౌష్టికాహారం, బాలింతలు, పుట్టిన పిల్లల నుంచి ఎదిగే వరకు తీసుకుంటున్న జాగ్రత్తలు, ప్రభుత్వ పథకాలను వివరించారు. ఈ సందర్భంగా జిల్లా వైద్యాధికారి మాట్లాడుతూ.. రాబోయే సమాజాన్ని ఆరోగ్యంగా తయారు చేయాలంటే గర్భిణుల నుంచే అనేక జాగ్రత్తలు, పౌష్టికాహారం అందించాల్సిన అవసరం ఎంతో ఉందన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందుకు ఎంతో కృషి చేస్తున్నాయని వారికి వివరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపవైద్యాధికారి డాక్టర్ సృజన, మండల వైద్యాధికారి డాక్టర్ పద్మలతో పాటు ఏఎన్ఎంలు, ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.

రైల్వే ట్రైనింగ్ ఇన్‌స్టిట్యూట్‌లో సమగ్ర శిక్షణ

సాక్షి, సిటీబ్యూరో: మౌలాలీలోని జోనల్ రైల్వే ట్రైనింగ్ ఇన్‌స్టిట్యూట్ నుంచి లభించే సమర్థవంతమైన శిక్షణ ద్వారానే ఎంతోమంది నిపుణులు విధులు నిర్వహిస్తున్నారని దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ అరుణ్‌కుమార్ జైన్ అన్నారు. రైల్వే ఇన్‌స్టిట్యూట్ 51వ వార్షికోత్సవం సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. దక్షిణ మధ్య రైల్వే అదనపు జనరల్ మేనేజర్, ఆర్.ధనుంజయులు, ప్రిన్సిపల్ చీఫ్‌ఆపరేషన్స్ మేనేజర్ బి.నాగ్య, ప్రిన్సిపల్ చీఫ్ కమర్షియల్ మేనేజర్ కె.ఆర్.కె రెడ్డి, సికింద్రాబాద్ డివిజనల్ రైల్వే మేనేజర్ భరతేష్ కుమార్ జైన్, హైదరాబాద్ డివిజనల్ రైల్వే మేనేజర్ లోకేష్ విష్ణోయ్, జడ్ఆర్‌టీఐ ప్రిన్సిపల్, జి.యాదగిరి, సీనియర్ రైల్వే అధికారులు, సిబ్బంది, ట్రైనీలు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా అరుణ్ కుమార్ జైన్ మాట్లాడుతూ, ఇజోనల్ రైల్వే ట్రైనింగ్ ఇన్‌స్టిట్యూట్ 51 సంవత్సరాల విశేష సేవలను పూర్తి చేసుకోవడం పట్ల హర్షం వ్యక్తం చేశారు.

నెరవేరిన 'కొండా' శపథం

- నాటి ఎన్నికలో పైలెట్‌కు కొండంత అండ
- పార్టీ మారడంతో విభేదాలు



కొండా విశ్వేశ్వర్‌రెడ్డి మాజీ ఎంపీ

తాండూరు: తాండూరులో మాజీ ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి శపథం నెరవేరింది. 2018 అసెంబ్లీ ఎన్నికలలో పైలెట్ రోహిత్‌రెడ్డికి టికెట్ ఇప్పించడంతో పాటు గెలుపునకు ప్రధాన కారణంగా ఉన్నారు. అయితే 2019 పార్లమెంట్ ఎన్నికల సమయంలో పైలెట్ రోహిత్‌రెడ్డి కొండా విజయానికి పని చేయకపోవడంతో నియోజకవర్గంలో బీఆర్ఎస్ పార్టీకి ఓట్లు ఎక్కువ వచ్చాయి. మరోవైపు రోహిత్‌రెడ్డి కాంగ్రెస్ పార్టీని వీడి బీఆర్ఎస్ పార్టీలోకి వెళుతున్న సమయంలో ఆయనకు సమాచారం ఇవ్వలేదు. దీంతో ఇద్దరి మధ్య విభేదాలు తారస్థాయికి చేరుకున్నాయి. పైలెట్‌కు ఎలాగైన ఓటమి రుచి చూపించాలని కొండా శపథం చేశారు. అందులో భాగంగా తాండూరులో బిజేపీ పార్టీ నుంచి బలమైన అభ్యర్థి పోటి చేస్తే పైలెట్ గెలుపునకు అనుకూలమవుతోందని భావించారు. దీంతో పొత్తులో భాగంగా జనసేన పార్టీ అభ్యర్థిని తాండూరులో బరిలో నిలబెట్టారు. ఎన్నికల ప్రచారంలో రెండుసార్లు వచ్చి ఎన్నికల ప్రచారం చేసిన కొండా విశ్వేశ్వర్‌రెడ్డి కేవలం పైలెట్ రోహిత్‌రెడ్డిని ఓడించాలని కార్యకర్తలకు, పార్టీ అభిమానులకు పిలుపునిచ్చారు. మరోవైపు ఎమ్మెల్యేల ఎర కేసులో బిజేపీపై బురదజల్లిన... నాలుగురు ఎమ్మెల్యేలను మాజీలుగా చేయడంలో బిజేపీ నేతల ఎత్తుగడ ఉన్నట్లు తెలుస్తోంది.

బైక్ చోరీలకు పాల్పడుతున్న నిందితుడి రిమాండ్



కేసు వివరాలు వెల్లడిస్తున్న పోలీసులు

తొమ్మిది ద్విచక్రవాహనాలు స్వాధీనం

చేవెళ్ల: మద్యానికి బానిసైన డ్రైవర్ ద్విచక్ర వాహనాల దొంగగా మారాడు. చోరీ చేసిన బైక్‌ను అమ్మేందుకు వెళ్తున్న నిందుతుడు పోలీసులకు పట్టుబడడంతో అతడు చేసిన దొంగతనాలన్నీ బయటపడ్డాయి. ఈ ఘటన చేవెళ్ల పీఎస్ పరిధిలో శుక్రవారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన ప్రకారం.. జిల్లా పరిధిలోని నందిగామ మండలం చేగూరు గ్రామానికి చెందిన గూడూరు రాజు(34) డ్రైవింగ్ చేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. మద్యానికి బానిసైన రాజుకు వృత్తిరీత్య వచ్చే డబ్బు సరిపోక పోవడంతో పార్క్ చేసిన బైక్ చోరీలకు పాల్పడుతున్నాడు. చేవెళ్ల పీఎస్ పరిధిలో 3, షాబాద్ పీఎస్ పరిధిలో 2, రాజేంద్రనగర్ పీఎస్ పరిధిలో 2, షాద్‌నగర్, మహబూబ్‌నగర్ పీఎస్‌ల పరిధిలో ఒక్కొక్క బైక్ చొప్పున మొత్తం 9 బైక్‌లు చోరీ చేశాడు. ఇలా చోరీ చేసిన బైక్‌లను స్వగ్రామంలో కొన్ని, తన తండ్రి పనిచేసే దేవుని ఎర్రవల్లి ఫాం హౌస్‌లో దాచి ఉంచి అమ్ముతున్నాడు. శుక్రవారం ఉదయం దొంగిలించిన ఓ బైక్‌ను అమ్మేందుకు వెళ్తుండగా చేవెళ్ల, సీసీఎస్ రాజేంద్రగనర్ పోలీసులు గుర్తించి పట్టుకున్నారు. పోలీసుల విచారణలో ఆయా పోలీస్‌స్టేషన్‌ల పరిధిలో చోరీ చేసిన తొమ్మిది బైక్‌ల వివరాలు వెల్లడించారు. బైక్‌లను స్వాధీనం చేసుకున్న పోలీసులు నిందితుడిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు.

బోగస్ ఓట్లను తొలగించండి

మొయినాబాద్: మండల పరిధిలోని సురంగల్ గ్రామంలోని బోగస్ ఓట్లను తొలగించాలని గ్రామస్తులు మండల తహసీల్దార్ గౌతమ్‌కుమార్‌కు ఫిర్యాదు చేశారు. శుక్రవారం వారు తహసీల్దార్ కార్యాలయానికి వచ్చి ఆయనకు ఫిర్యాదు పత్రాన్ని అందజేశారు. గ్రామంలో సుమారు మూడు వందలకు పైగా బోగస్ ఓట్లు ఉన్నాయని ఫిర్యాదులో ప్రస్తావించారు. గ్రామానికి సంబంధం లేని ఇతర ప్రాంతాలకు చెందిన వ్యక్తుల ఓట్లు సురంగల్‌లో వచ్చాయన్నారు. బతుకుదెరువుకోసం కూలీ పనులకు ఇతర ప్రాంతాలు, ఇతర రాష్ట్రాల నుంచి వచ్చి ఫాంహౌస్‌ల్లో, భవన నిర్మాణ పనులు చేసేవారికి ఇక్కడ ఓట్లు వచ్చాయని.. కొంత మంది రాజకీయ నాయకులు తమ స్వలాభం కోసం ఇతర ప్రాంతాలు, ఇతర రాష్ట్రాలకు చెందిన కూలీల ఓట్లను సురంగల్‌లో నమోదు చేయించారన్నారు. గ్రామంలో విచారణ జరిపి బోగస్ ఓట్లను తొలగించాలని కోరారు. ఫిర్యాదు చేసినవారిలో మాజీ ఉప సర్పంచ్ అంజిరెడ్డి, నాయకులు భాస్కరాచారి, మహేందర్‌రెడ్డి, నర్సింహగౌడ్, యాదగిరియాదవ్ తదితరులున్నారు.



తహసీల్దార్ గౌతమ్‌కుమార్‌కు ఫిర్యాదు చేస్తున్న సురంగల్ గ్రామస్తులు

బీఎల్ఓ, సూపర్‌వైజర్లతో సమావేశం

రాజేంద్రనగర్: రాజేంద్రనగర్ సర్కిల్ పరిధిలోని బీఎల్ఓ, సూపర్‌వైజర్లతో శుక్రవారం జీహెచ్ఎంసీ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ప్రాజెక్టు అధికారిణి రాధారాణి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ సమావేశానికి ఉప కమిషనర్ రవి కుమార్ హాజరయ్యారు. ఈ సందర్భంగా బీఎల్ఓలతో పాటు సూపర్‌వైజర్లకు ఓటర్ల ముసాయిదా సవరణపై సూచనలు, సలహాలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎన్నికల కమిషన్ ఆదేశానుసారం ఓటర్ల జాబితాలో పేర్లు, ఇంటి చిరునామా మార్పు, మృతి చెందిన వారి పేర్ల తొలగింపు, ఒకే వ్యక్తిపై రెండు, మూడు ఓట్లు ఉన్న వాటిని తొలగించడం, ఒకే కుటుంబ సభ్యుల ఓట్లను ఓకే పోలింగ్ బూత్‌లో పొందుపరచడం, పోలింగ్ బూత్‌ల మార్పు తదితర వాటిపై సవరణకు అవకాశం ఇచ్చిందన్నారు. అలాగే కొత్త ఓటర్లు దరఖాస్తు చేసుకోవచ్చునన్నారు. ఈ ప్రక్రియను ముమ్మరం చేస్తున్నామన్నారు. ఓటర్లు తమ బీఎల్ఓలను సంప్రదించి మార్పులు, ఇతర చేరికలు ఏమైనా ఉంటే పొందుపరుచుకోవాలని సూచించారు. జనవరిలో తుది జాబితాను విడుదల చేయనున్నట్లు తెలిపారు. రాజేంద్రనగర్ సర్కిల్ పరిధిలో బూత్‌ల వారిగా బీఎల్ఓలు అందుబాటులో ఉన్నారన్నారు. బీఎల్ఓలతో పాటు సూపర్‌వైజర్లను సంప్రదించాలన్నారు.

ఓయూలో 30న నిరుద్యోగ విజయోత్సవ సభ

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూలో ఈ నెల 30న ఆర్ట్స్ కాలేజీ వేదికగా నిరుద్యోగ విజయోత్సవ సభను నిర్వహించనున్నట్లు నిరుద్యోగ జేఏసీ చైర్మన్ భీమ్‌రావు తెలిపారు. శుక్రవారం ఓయూలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో కాంగ్రెస్ గెలుపు నిరుద్యోగుల విజయంగా భావిస్తూ లక్ష మందితో సభను నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. పదేళ్ల బీఆర్ఎస్ పాలన నిరుద్యోగుల పాలిట శాపంగా మారిందన్నారు. బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ పాలనలో వివిధ కారణాల వలన 250 మంది నిరుద్యోగులు మరణించారని ఆవేదన వ్యక్తం చేశారు. ఉద్యోగాల భర్తీ, టీఎస్‌పీఎస్సీ నియామకాలలో అవినీతి అక్రమాలు, గ్రూప్-2 పేపర్ లీకేజీ ప్రజా వ్యతిరేక పాలన కారణంగా అసెంబ్లీ ఎన్నికల్లో నిరుద్యోగులు, ప్రజలు తగిన బుద్ధి చెప్పారన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారం చేపట్టినందున ఆర్ట్స్ కాలేజీ వేదికగా నిరుద్యోగ జేఏసీ ఆధ్వర్యంలో జరిగే విజయోత్సవం సభకు అధిక సంఖ్యలో హాజరుకావాలని కోరారు. కార్యక్రమంలో మిడతనపల్లి విజయ్, కొర్ర ఈశ్వర్ లాల్, హాలావత్ మోహన్‌నాయక్, తిరుపతిరెడ్డి, బాలు నాయక్ తదితరులు పాల్గొన్నారు.

'మున్సిపల్ కమిషనర్‌పై చర్యలు తీసుకోవాలి'

శంషాబాద్: అక్రమ నిర్మాణాలను ప్రోత్సహిస్తున్న శంషాబాద్ మున్సిపల్ కమిషనర్‌పై ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని పీసీసీ ఎస్సీసెల్ ఉపాధ్యక్షుడు జల్లపల్లి నరేందర్ డిమాండ్ చేశారు. శుక్రవారం స్థానికంగా ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. మున్సిపాలిటీలో జీవో 111 నిబంధనలకు వ్యతిరేకంగా భారీ ఎత్తున అక్రమ కట్టడాలు జరుగుతున్నా మున్సిపల్ కమిషనర్ భోగీశ్వర్లు ఎటువంటి చర్యలు తీసుకోవడం లేదన్నారు. రైతుల పొలాల మధ్య వివాదాస్పద భూములైన 103 సర్వేనంబర్లలో ఎనిమిదెకరాల చొప్పుల ఫాంహౌస్‌లు నిర్మాణం జరుగుతున్న వాటిపై కమిషనర్‌కు ఫిర్యాదు చేశామన్నారు. చర్యలు తీసుకుంటానని చెప్పిన కమిషనర్ నోటీసులు ఇచ్చి చేతులు దులుపుకున్నాడన్నారు. ప్రస్తుతం అక్కడ నిర్మాణాలు కూడా పూర్తవుతున్నాయన్నారు. పట్టణంలో జరుగుతున్న అక్రమ నిర్మాణాల్లో మున్సిపల్ కమిషనర్, టౌన్ ప్లానింగ్ విభాగం నిర్లక్ష్యం స్పష్టంగా కనిపిస్తోందన్నారు. ఉన్నతాధికారులు చర్యలు తీసుకోని పక్షంలో సీఎం ప్రజాదర్బార్‌లో సమస్యను వివరించి పరిష్కరించుకుంటామన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు పి.సంజయ్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.